రామాయంపేట విద్యానికేతన్ పాఠశాలలో..

పెద్దశంకరంపేటలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

చేగుంట: నార్సింగి అంగన్‌వాడీ కేంద్రంలో..

మెదక్ మున్సిపాలిటీ: కోలాటమాడుతున్న చిన్నారులు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

- రాధాకృష్ణులు, గోపికల వేషాలతో ఆకట్టుకున్న ఆయా పాఠశాలల విద్యార్థులు
- అలరించిన చిన్నారుల వేషధారణలు
- విచిత్ర వేషధారణతో శోభాయాత్ర నిర్వహణ

మెదక్ మున్సిపాలిటీ/మెదక్‌రూరల్/రామాయంపేట/పెద్దశంకరంపేట/చేగుంట/మనోహరాబాద్/చిలిపిచెడ్/కౌడిపల్లి/నిజాంపేట/పాపన్నపేట, ఆగస్టు 26: జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమిని సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు రాధాకృష్ణ, గోపికల వేషధారణలు వేసి ఆటలాడించారు. అనంతరం ఉట్టి కొట్టించి పాటలు పాడించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించి పండ్లు, తులసీ దళాలతో తూకం వేశారు. కొన్ని ప్రాంతాల్లో శోభాయాత్ర నిర్వహించారు. కృష్ణుడు, గోపికలు, యశోద, అల్లూరి సీతారామరాజు, భరతమాత, భగత్ సింగ్, శివాజీ, భీముడు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, రాణి రుద్రమ్మ, లక్ష్మీబాయి వేషధారణలు ఆకట్టుకున్నారు.

పాపన్నపేట శ్రీవిద్య పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

నిజాంపేటలో కృష్ణుడు,గోపిక వేషధారణలతో..

చిలిపిచెడ్‌లో..

కౌడిపల్లిలో..

శ్రీకృష్ణుడిగా..

మనోహరాబాద్: కాళ్లకల్‌లోని గౌతమి స్కూల్‌లో..

యువతి అదృశ్యం

స్వాతి

చిలిపిచెడ్, ఆగస్టు 26: చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యమైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. చండూర్ గ్రామానికి చెందిన నీరుడి స్వాతి శనివారం రాత్రి నుంచి కనబడుటలేదు. దీంతో తమ బంధువుల వద్ద, చుట్టుపక్కల అంతటా వెతికినా సమాచారం లభించలేదు. స్వాతి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

వివాహిత అదృశ్యం

సరస్వతి

అల్లాదుర్గం, ఆగస్టు 26: కూతురుతో కలిసి స్వామి దగ్గరికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన టేక్మాల్ మండలంలోని వెంకటాపూర్ లో జరిగింది. టేక్మాల్ ఏఎస్సై దయానంద్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన కిష్టాపురం కిష్టమ్మకు ముగ్గురు కూతుళ్లు, చిన్న కూతురు గొల్ల సరస్వతి భర్త చనిపోవడంతో తల్లి దగ్గరే ఉంటున్నది. ఈనెల 23న సరస్వతి తన కూతురితో కలిసి నర్సాపూర్ వద్ద ఉన్న స్వామి దగ్గరికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి, కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తల్లి కిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కాట్రో రోజా(ఫైల్)

కౌడిపల్లి, ఆగస్టు 26: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన కౌడిపల్లి మండలం రాయిలాపూర్ తండాలో సోమవారం జరిగింది. మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిలాపూర్ తండాకు చెందిన కాట్రోత్ రోజా(28)కి 12 ఏండ్ల క్రితం హలావత్ పరశురాంతో వివాహం జరిగింది. తరుచూ భార్యాభర్తలకు గొడవలు జరిగేవి. రోజా అన్న కాట్రోత్ కుమార్ వచ్చి గొడవలు జరిగినప్పుడల్లా సర్దిచెప్పి వెళ్లిపోయేవాడు. శనివారం రాత్రి భార్యాభర్త మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో రోజా పొలం పక్కన ఉన్న కోళ్లఫారం వద్దకు వెళ్లి, గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. గమనించిన ఇరుగు పొరుగు వారు వెంటనే నర్సాపూర్ దవాఖానకు, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MOHD FASI MOHIUDDIN. S/o. Md Ghouse Mohiuddin (New Name), previously called MOHAMMED FASI MOHIUDDIN. S/o. Mohammed Ghouse Mohiuddin, Govt. Employee, R/o. H.No. 8-1-144, Shairpura, Siddipet Town & Urban (M), Siddipet Dist., TS, have Changed My Name as MOHD FASI MOHIUDDIN, S/o. Md Ghouse Mohiuddin instead of MOHAMMED FASI MOHIUDDIN, S/o. Mohammed Ghouse Mohiuddin for all purpose.

NT-Tirupathi

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీఎంఆర్ఎఫ్ కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- బ్లీచింగ్ పౌడర్‌కూ నిధులు లేని దుస్థితి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

వెల్దుర్తి/కొల్చారం/నర్సాపూర్, ఆగస్టు 26: వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా వచ్చే డబ్బు కొంత ఆర్థిక వెసులుబాటును కలిగిస్తుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం వెల్దుర్తి, కొల్చారం మండలాల్లోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 47, కొల్చారం మండలంలో 58 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎనిమిది నెలల కాలంలో చాలా తక్కువగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలడంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్‌కు కూడా పంచాయతీల్లో నిధులు లేవని, కొత్త ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా, పంచాయతీ పాలనను పట్టించుకోవడం లేదన్నారు. డీపీవోతో మాట్లాడి బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందును పిచికారీ చేయించాలని కోరారు.

కేసీఆర్ మంజూరు చేసిన నిధులు రద్దు చేసిన ప్రభుత్వం

బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నర్సాపూర్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరుచేయలేదన్నారు. ఎస్‌డీఎఫ్, ఆర్‌అండ్‌బీ, ట్రైబల్ సబ్ ప్లాన్ నుంచి విడుదలైన నిధులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. 24 పనులకు (బీటీ రోడ్లకు) రూ.46.35 కోట్ల నిధులను విడుదల చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, నాయకులు రాజేశ్, రింగుల ప్రసాద్, మాణయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తిలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొల్చారంలో సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే

ప్రభుత్వం లేకున్నా.. సమస్యల పరిష్కారం

పలు గ్రామాల రోడ్ల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో వెల్దుర్తి, మాసాయిపేట మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మన్సూర్, అశోక్‌గౌడ్, రమేష్‌చందర్, ఖాజా, శాఖారం శ్రీను, శేఖర్, శ్రవణ్ పాల్గొన్నారు.

కొల్చారంలో..

కొల్చారంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ నాయకుడు చౌరిగారి నర్సింహులు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆమె స్థానిక బాబా ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండలాధ్యక్షుడు గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు. మండలానికి చెందిన 58 మంది లబ్ధిదారులకు బిఆర్ఎస్ నాయకులతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, యువత అధ్యక్షుడు సంతోష్, మాజీ ఎంపీపీ మంజూలా కాశీనాథ్, జిల్లా నాయకులు సంతోష్ కుమార్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ అలీ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, అరిగె రమేశ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, కరెంటు రాజాగౌడ్, సొసైటీ చైర్మన్ మనోహర్ పాల్గొన్నారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్, ఆగస్టు 26: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు వెంకటాయపల్లి బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ హరీశ్‌గౌడ్ అందజేశారు. వెంకటాయపల్లికి చెందిన జంగం రాజు, కొంతం రవి అనారోగ్యంతో ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందారు.మంజూరైన చెక్కులను సోమవారం బాధితులకు అందజేశారు. వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, స్వామిగౌడ్, వెంకట్‌గౌడ్, పెంటాగౌడ్, రాజుగౌడ్, శ్రీనివాస్, మహేశ్‌యాదవ్, కె.శ్రీనివాస్, వెంకటేశ్, పాల్గొన్నారు.

తూప్రాన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ హరీశ్‌గౌడ్

ఏడుపాయల్లో అక్రమ దుకాణాలు సీజ్

అక్రమ దుకాణాలు సీజ్ చేస్తున్న ఆలయసిబ్బంది

పాపన్నపేట, ఆగస్టు 26: ఏడుపాయల్లో వెలిసిన అక్రమ దుకాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. ఇటీవల ఎలాంటి అనుమతులు లేకుండా ఏడుపాయల్లో తాత్కాలిక షాపులను ఏర్పాటు చేసుకుని, నిబంధనలకు అతీతంగా కిరాయిలు ఇస్తూ, అధిక మొత్తంలో రోజుకు రెండు నుంచి మూడు వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ విషయమై ఈవో చంద్రశేఖర్ ఆదేశాల మేరకు సిబ్బంది పోలీసుల సహకారంతో 25 దుకాణాలను సోమవార సీజ్ చేశారు.

పరిస్థితి విషమించి మహిళా మృతి

శివ్వంపేట, ఆగస్టు 26: చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మహిళ మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామానికి చెందిన సుండు ఇందిరమ్మ (38) గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 19న మధ్యాహ్నం అనారోగ్య సమస్యలతో పురుగుల మందుతాగి రాఖీ కట్టడానికి ఆమె పుట్టిల్లు రామాయపల్లికి వెళ్లింది. ఇంట్లో కింద పడిపోగా ఆమెను చికిత్స నిమిత్తం మెదక్ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందింది. జీవితంపై విరక్తి చెంది గుర్తుతెలియని పురుగుల మందు తాగి చనిపోయిందని ఆమె తండ్రి గుండు వెంకట్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.

రెండిండ్లలో చోరీ

చెల్లాచెదురుగా పడిఉన్న సామగ్రి

నర్సాపూర్, ఆగస్టు 26: ఇంటి తాళాలు పగులగొట్టి రెండిండ్లలో చోరీ చేసిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్లపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లికి చెందిన ఎర్రగొల్ల ముత్యాలు, శ్రీనాథ్‌గౌడ్ ఇండ్లకు తాళాలేసి బంధువుల ఇంటికి వెళ్లారు. అదే అదునుగా దుండగులు ఇరువురి ఇండ్లలో చోరీ చేశారు. ఎర్రగొల్ల ముత్యాలు ఇంట్లో 15 వేల నగదు, 20 తులాల వెండి, శ్రీనాథ్ ఇంట్లో పది వేల నగదు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అల్లాదుర్గం, ఆగస్టు 26: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్‌రెడ్డి అన్నారు. సోమవారం అల్లాదుర్గంలోని కేజీబీవీలో పోలీసు కళాబృందంతో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మోసపూరిత ఆశలు, గిఫ్ట్‌లు వచ్చాయని, లక్కీ డ్రాలో గెలుపొందారని మోసం చేస్తున్నారన్నారు. ఓటీపీ, బ్యాంకు డీటేల్స్ అపరిచిత వ్యక్తులకు పంపవద్దన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాల సమాచారాన్ని 8712657888కు, పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. కళా బృందం సభ్యుడు సురేందర్ పాల్గొన్నారు.

కౌడిపల్లి, ఆగస్టు 26: మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి 112వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, విమలరెడ్డి, సుహాసిని రెడ్డి, రఘువీరారెడ్డి నివాళులర్పించారు.

రామాయంపేటలో ఇంటింటికీ ఆరోగ్యం

రామాయంపేట, ఆగస్టు 26: సీజనల్ వ్యాధులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలుపాలని డీ.ధర్మారం పీహెచ్‌సీ డాక్టర్ హరిప్రియ తెలిపారు. సోమవారం ఆరోగ్యసిబ్బంది రామాయంపేటలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం.అనిత, యశోద, లక్ష్మి ఉన్నారు.

నిల్వ నీటిని పారబోస్తున్న వైద్యసిబ్బంది

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. మూడో వార్డులో వర్షాలకు మురుగు నీరంతా రోడ్డుపై చేరింది. దీంతో ఆయన స్పందించి జేసీబీ ద్వారా మట్టిని పోయించారు. చైర్మన్ వెంట వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, నాయకులు పుట్టి యాదగిరి, ఎనిశెట్టి సంతోష్, కందుకూరి శ్రీనివాస్, వికాస్, రవీందర్ తదితరులు ఉన్నారు.

మురుగు నీటిని జేసీబీ సాయంతో తొలిగింపజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌రెడ్డి

నిధులు కేటాయించాలని ఎంపీకి వినతి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేగుంట, ఆగస్టు 26: మండలంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ ఎంపీ రఘునందన్‌రావును మండల నాయకులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఇబ్రహీంపూర్‌లో పంచాయతీ భవనం, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, పదో తరగతి పరీక్ష కేంద్రం, వడియారంలో రాయలసీమ, దేవగిరి రైళ్లు ఆపాలని, రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో ఇబ్రహీంపూర్ మాజీ సర్పంచ్ నాగభూషణం, రుక్మాపూర్ ఉప సర్పంచ్ రాంచంద్రం, ఆంజనేయులు, మల్లేశం, భూపాల్, వెంకన్న, రవి, నర్సింహులు, స్వామి, జగదీశ్వర్, రవీందర్, సుధాకర్ తదితరులున్నారు.

మల్లన్న ఆలయంలో రుద్రాభిషేకాలు

మెదక్‌రూరల్, ఆగస్టు 26: మండలంలోని మంబోజిపల్లి కొయ్యగుట్ట మల్లన్న ఆలయంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని స్వామి వారికి రుద్రాభిషేకాలు చేశారు. పూజారి మల్లన్న ఆధ్వర్యంలో 41 వేల బిల్వపత్రాలతో పూజించారు

కొప్పోల్‌లో పూజలు చేస్తున్న భక్తులు

కొప్పోల్‌లో శ్రావణమాసపు పూజలు

పెద్దశంకరంపేట, ఆగస్టు 26: శ్రావణ సోమవారం సందర్భంగా కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లింగానికి జలాభిషేకాలు, ఆకుపూజ, అన్న పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. కన్నయ్యగారి శివశంకర్, రాయిని రాములు అన్నదానం చేశారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, ఆగస్టు 26: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా వాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలు లేకుండా పోలీస్ సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు.

కరాటేతో శారీరక పటుత్వం, ఆత్మరక్షణ

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 26: కరాటేతో శారీరక పటుత్వం, ఆత్మరక్షణ, మానసికోల్లాసం కలుగుతాయని రెంజుకి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు నగేశ్ అన్నారు. సోమవారం కరాటే అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక గుల్షన్ క్లబ్‌లో జిల్లాస్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో ఆయా మండలాలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బ్లాక్, బ్రౌన్, ఎల్లో బెల్టులు సాధించారు. కార్యక్రమంలో కరాటే మాస్టార్లు దినకర్, సూరజ్, మనివర్దన్, అఖిల్, అబ్దుల్లా పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

మెదక్ అర్బన్, ఆగస్టు 26: ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలైన ఘటన హవేళీఘనపూర్ మండలంలోని దూప్‌సింగ్ తండాలో సోమవారం జరిగింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రవి రోజు మాదిరిగా ఉదయం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో రవిపై ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. దాడిలో ఎడమ దవడ, చెవి, కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. పక్క పొలాల్లోని రైతులు ఎలుగుబంటిని బెదరగొట్టడంతో అడవిలోకి పారిపోయింది. రైతు రవిని మెదక్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి గాయపడ్డ రవికి చికిత్స కోసం రూ.10వేల అందించారు.

రుణమాఫీ వచ్చినా ఇవ్వడం లేదు

చేగుంట, ఆగస్టు 26: మూడో విడతలో పంట రుణమాఫీ వచ్చినా సొసైటీలో ఇవ్వడంలేదు. ఇబ్రహీంపూర్ సొసైటీలో రూ,1.52 లక్షల రుణమాఫీ వచ్చింది. దాని సంబంధించిన భూమి పత్రాలతో పాటు అన్ని సొసైటీ అధికారులకు అప్పు జెప్పిన. ఇప్పటి వరకు నాకు పైసలు జమ కాలేదు. సొసైటీ అధికారులు పట్టించుకుంటలేరు. పైసలు ఖాతాలో జమ చేస్తానన్నరు. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు జమ కాలే.

- సంబిగారి బాలమణి, మహిళా రైతు, చేగుంట

తల్లీబిడ్డకు ప్రాణం పోసిన వైద్యులు

తల్లీబిడ్డను కాపాడిన ఎంసీహెచ్ డాక్టర్ల బృందం

మెదక్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఒక మహిళకు క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ శివ దయాల్ తెలిపారు. చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల జ్యోతిని రెండో కాన్పు కోసం ఎంసీహెచ్ దవాఖానకు తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం మెదక్ ఎంసీహెచ్‌కు తీసుకొచ్చారు. డాక్టర్లు శివ దయాల్, శిల్ప, సునీల్, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో రాత్రి శస్త్రచికిత్స చేశారు. ఆ సమయంలో మహిళ కడుపు లో (అండాశయ తిత్తి) కణితిని గుర్తించారు. దాదాపు మూడు గంటలు శ్రమించి కిలోన్నర కణితి తొలిగించి తల్లీబిడ్డకు ప్రాణం పోశారు. కణితిని బయాప్సీకి పంపినట్లు వైద్యులు తెలిపారు. వైద్య బృందానికి ఆ మహిళ భర్త మహిపాల్ కృతజ్ఞతలు తెలిపాడు.

బండ పాశం.. భక్తుల పరవశం

వెల్దుర్తి, ఆగస్టు 26: వెల్దుర్తి మండలంలోని బస్వాపూర్ పంచాయతీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, విశేషాలంకరణ నిర్వహించారు. ఏండ్ల కాలం నుంచి వస్తున్న బెల్లంతో చేసిన పాశంను బండపాశాన్ని తిని కోరిన కోర్కెలు తీర్చాలని శివయ్యను వేడుకున్నారు. పూజల్లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు 30 వేల విరాళం



శివ్వంపేట, ఆగస్టు 26: మండలంలోని పాంబండ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శివ్వంపేట సొసైటీ చైర్మన్ చింతల వెంకట్రామిరెడ్డి రూ. 30 వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. సెప్టెంబర్ 1న అంబేద్కర్ విగ్రహావిష్కరణకు రావాలని నిర్వాహకులు ఆయనను కోరారు. ఆయనతో వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివుడు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు లింగం, కుమార్, రవీందర్ రెడ్డి, వేణు, వెంకటేశ్, శ్రీనివాస్, నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దుర్తి, ఆగస్టు 26: మూర్ఛ వ్యాధితో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మండలంలోని నెల్లూర్ గ్రామానికి చెందిన శాకం శంకర్(29) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు రంగారెడ్డి మృతుడి భార్య నవనీతకు అంత్యక్రియల నిమిత్తం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా కేశవనాథ ఆలయ వార్షికోత్సవం

అల్లాదుర్గం, ఆగస్టు 26: అల్లాదుర్గంలోని కేశవనాథ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి అన్నదానం చేశారు.

అన్నదానం చేస్తున్న భిక్షపతి